క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలు విడుదల చేయాలని ఏపీటీఎఫ్ 257 సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య, జాకీర్‌హుసేన్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై వారు సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.

శిక్షణకు వెళ్లిన ఉయ్యాలవాడ ఎంపీడీఓ

శిరివెళ్ల: ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప పాలన పర అంశాలపై నెల రోజుల శిక్షణ నిమిత్తం శ్రీకాళహస్తికి వెళ్లారు. దీంతో డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసశర్మకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పంచాయతీ ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు. ఆగస్టు 25న తిరిగి రెగ్యులర్ ఎంపీడీఓ విధుల్లో చేరుతారు.

బోధనేతర పనుల నుంచి మినహాయించాలి



డీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోపాల్‌రావు, నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగిరి శ్రీనివాసులు, పుల్లయ్య, ఆవుల మునిస్వామి, వెంకటేశ్వర్లు సోమవారం డీఈఓ జనార్ధన్‌రెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధన మాత్రమే పరిమితం చేయాలన్నారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి వెంటనే చెల్లించాలన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలవాలి

నంద్యాల(వ్యవసాయం): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలవాలని, ఇందుకుగాను పార్టీ కార్యకర్తలు, కష్టపడి పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన నంద్యాలలో పర్యటించారు. ముందుగా పద్మావతినగర్ ఆర్చి నుంచి వై జంక్షన్ వరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఆధ్వర్యంలో కార్యకర్తలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం స్థానిక సౌజన్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగురవేద్దామన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఖాదరబాద్ నర్సింగరావు, శివనారాయణ, రాయలసీమ ఇన్‌చార్జి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఉయ్యాలవాడ : ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ సువర్ణాదేవి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌కు హాజరైన అధికారులతో వారు మాట్లాడారు. గ్రామాల్లో అంటు రోగాలు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు వెంకటయ్య, ఫణీత్‌క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలకు బహిరంగ వేలం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీకాళికాంబా చంద్రశేఖరస్వామి దేవస్థానం, శ్రీబ్రహ్మనందీశ్వరస్వామి దేవస్థానం, గుడిపాటిగడ్డలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయాల ఖాళీ స్థలాల వేలం పాట సోమవారం గుడిపాటిగడ్డలోని శ్రీమల్లికార్జునస్వామి దేవస్థానంలో నిర్వహించారు. తనిఖీ అధికారి హరిశ్చంద్రారెడ్డి, ఈఓ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ వేలం పాటలు జరిగాయి. శ్రీకాళికాంబా చంద్రశేఖరస్వామి దేవస్థానం 38 సెంట్ల స్థలం రూ.16వేలు, శ్రీబ్రహ్మనందీశ్వరస్వామి దేవస్థానం 69 సెంట్ల స్థలం రూ.31 వేలు, శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానం 97 సెంట్ల స్థలం రూ.15,500 వేలం పాటలు జరిగినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆరవేటి వాసు, రాజ్యలక్ష్మి, భాగ్యలక్ష్మి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీఓ నేత వెంగళ్ రెడ్డిపై నేడు విచారణ

కర్నూలు (అగ్రికల్చర్): ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డిపై జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణమ్మ మంగళవారం విచారణ జరపనున్నారు. ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్‌లో ఉపాధ్యక్షుడిగా ఉన్న సాంబ శివారెడ్డి పలు ఆరోపణలతో వెంగళ్ రెడ్డిపై జిల్లా కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్వో వెంగళ్ రెడ్డికి ఇటీవల నోటీసులు కూడా జారీ చేశారు. ఇందులో భాగంగా మంగళవారం విచారణకు హాజరుకావాలని డీఆర్వో ఆదేశించినట్లు సమాచారం.





నంద్యాల పట్టణంలోని రోజాకుంట షాదీఖానాలో ఏర్పాటు చేసిన సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

సంపద లేదు..సూపర్ సిక్స్ లేదు

- చంద్రబాబువన్నీ అబద్ధాలే
- అధికారం కోసం ఎన్నికల ముందు మాయమాటలు
- బాబు షూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో శిల్పారవి ధ్వజం



బాబుష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల: ఎన్నికల ముందు గొప్పలు చెప్పిన చంద్రబాబు ఏడాది పాలనలో సంపద సృష్టించలేదు..సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేదని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రేషన్, పింఛన్, సంక్షేమ పథకాలు ఇంటింటికి అందిస్తే చంద్రబాబునాయుడు మాత్రం మద్యం డోర్ డెలివరి చేస్తున్నారని మండిపడ్డారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని రోజాకుంట షాదీఖానాలో 39, 40, 41, 42 వార్డుల నాయకులు, ప్రజలతో బాబు షూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో శిల్పారవి మాట్లాడుతూ చంద్రబాబు అబద్ధాలు చెప్పడంలో ఆరితేరారన్నారు. ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. అలాగే సంపద సృష్టిస్తామని చెప్పి కూటమి నాయకులు వారి సంపద పెంచుకుంటున్నారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం ఏ పది మంది కలిసినా చంద్రబాబు చేసిన మోసాలు, నాయకుల అవినీతి గురించే చర్చించుకుంటున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండటమే కాక ఇంటింటికి వెళ్లి వారి అవసరాలు తెలుసుకున్నారని, నాడు ఎక్కడా కనిపించని టీడీపీ నాయకులు ఎన్నికల్లో గెలవడం ఆశ్చర్యంగా ఉందన్నారు.

తల్లికి వందనం పేరుతో మోసం

ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంతమందికి తల్లికి వందనం పథకం అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక నిబంధనల పేరుతో కోత విధించడం మోసం కాదా అని మాజీ ఎమ్మెల్యే ప్రశ్నించారు. మొదటి ఏడాది తల్లికి వందనం పథకం అమలు కాలేదు. కనీసం రెండో ఏడాది కూడా సక్రమంగా అమలు చేయకపోతే ఎలా అన్నారు. ఎంత మంది పిల్లల తల్లులకు నగదు జమ చేశారో చెప్పడం లేదన్నారు. తల్లికి వందనం కింద 39, 40, 41 వార్డులలో చంద్రబాబు ప్రభుత్వం చేసిన మోసాన్ని లెక్కలతో సహా వివరించారు. 39వ వార్డులో నాడు వైఎస్సార్‌సీపీ సర్కారు 461 మంది తల్లులకు అమ్మఒడి అందించగా ఈ ప్రభుత్వం 340 మందికి, 40వ వార్డులో వైఎస్సార్‌సీపీ సర్కారు 329 మందికి ఇవ్వగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 219 మందికి, 41 వార్డులో అప్పట్లో 456 మందికి ఇవ్వగా ప్రస్తుతం 325 మందికి, 42వ వార్డులో నాడు 574 మంది తల్లులకు ఇవ్వగా ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో 425 మందికి తల్లికి వందనం ఇచ్చారన్నారు. ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ వేస్తామని చెప్పినప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన వాటి కంటే టీడీపీ ప్రభుత్వంలో ఇస్తున్న సంఖ్య ఎందుకు తగ్గుతుందో కూటమి నాయకులు ప్రజలకు చెప్పాలన్నారు. ఈ రోజుల్లో మోసం చేస్తే దాగదన్నారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన బాబును బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి శశికళారెడ్డి, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, కౌన్సిలర్లు ఎస్.పి.శిరీష, లక్ష్మీదేవి, పున్నా రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు పున్నాశేషయ్య, లక్ష్మీనారాయణ, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్ పాలనకు భయపడరు

చంద్రబాబు రెడ్‌బుక్ పాలనకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలెవ్వరూ భయపడరని మాజీ ఎమ్మెల్యే శిల్పారవి అన్నారు. 15 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేశానని చెప్పుకుంటున్న చంద్రబాబు ఆయన పేరు చెబితే ఏ ఒక్క పథకమైనా గుర్తుకు వస్తుందా అని ప్రశ్నించారు. వైఎస్సార్ పేరు చెబితే ఆరోగ్యశ్రీ, 108, ఫీజు రీయింబర్స్‌మెంట్, ముస్లింల రిజర్వేషన్ వంటివి, వైఎస్ జగన్ పేరు చెబితే అమ్మ ఒడి, రైతుభరోసా, చేదోడు, నేతన్న నేస్తం, చేయూత, నాడు-నేడు, సచివాలయ, వలంటరీ వ్యవస్థ వంటివి అనేకం గుర్తుకొస్తాయన్నారు.

అధికారం కోసమే హామీలు



క్రిష్టిపాడులో మహిళలకు చంద్రబాబు మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

- ఏడాది పాలనలో ప్రజలకు చేసింది శూన్యం
- తొలి నుంచి నమ్మించి మోసం చేయడం బాబు నైజం
- బాబుష్యూరిటీ-మోసం గ్యారెంటీలో మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

దొర్నిపాడు: 2024 ఎన్నికల్లో అధికారం కోసమే చంద్రబాబు హామీలు గుప్పించారని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి విమర్శించారు. ప్రజలను మోసం చేయడం తొలి నుంచి బాబు నైజమన్నారు. సోమవా రం క్రిష్టిపాడు, చాకరాజువేముల గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ, రీకాలింగ్ బాబు మేని ఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశా రు. ఇంటింటికి వెళ్లి బాబు మోసాలను వివరించారు. తల్లికి వందనం పథకం ఎంత మంది పిల్లలుంటే అందరికి ఇస్తామన్నారు. చాలా మందికి ఇస్తారనే మాట పక్కన పెడితే ఇవ్వాల్సిన దాంట్లోనే కోతపెట్టి సగ డబ్బులే జమచేయడం ఎంటని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు కాక వేలాది మంది విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారన్నారు. ఇక రైతాంగం సంక్షేమం ఊసేలేదని, గిట్టుబాటు ధర లు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నా రు. 'ఆడబిడ్డ నిధి' పథకం కావాలంటే రాష్ట్రాన్ని అ మ్మాలని సాక్షాత్తు మంత్రి అచ్చెన్నాయుడు చెప్పడం చూస్తే ఇక ఆడపడుచుల నోట్లో మట్టి కొట్టినట్లేనని తేటతెల్లమైందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో భయానక వాతావరణం ఏర్పడిందన్నారు. వైఎస్ జగన్ పాలనలో పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. ఈవిషయాన్ని ప్రజలే చెబుతున్నారన్నారు. చంద్రబాబును నమ్మి మోసపోయామని వారు గ్రహించారన్నా రు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి భూమా కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందన్నారు. అయితే, ఇక్కడ భయపడే వారు ఎవ్వరూ లేరన్నారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ప్రెసిడెంట్ బత్తుల నాగేశ్వరరావు, సొసైటీ మాజీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, గ్రామ సర్పంచ్ శివరామిరెడ్డి, ఉప సర్పంచ్ మహేష్, నాయకులు భూమా వీరభద్రారెడ్డి, మోహన్‌నాయుడు, శ్రీనివాసరెడ్డి, విష్ణు, క్రిష్ణారెడ్డి, జాకీర్, శంకర్‌రెడ్డి, చిన్నబాషా, శ్రీపతి ప్రసాద్, నసిరుద్దీన్ బాషా, వెంకట సుబ్బరాయుడు, డీలర్ పెద్దన్న, శాంతయ్య, వాసు, మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



చాకరాజువేములలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కేంద్ర ప్రభుత్వ నిధులు సద్వినియోగం చేసుకోవాలి



ఎన్ఆర్ఈజీఎస్ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): గ్రామాలో వివిధ పనులకు మంజూరైన కేంద్రప్రభుత్వ నిధులు సద్వినియోగ మయ్యేలా చూడాలని నేషనల్ మానిటరింగ్ టీం లీడర్ సంతోష్ కుమార్ చెప్పారు. మండలంలోని భీమవరం, బిల్లలాపురం గ్రామాల్లో సోమవారం నేషనల్ మానిటరింగ్ టీం పర్యటించి ఎంజీఎన్ఆర్ ఈజీఎస్, పీఆర్, హౌసింగ్, డీఆర్‌డీఏ, ఎన్ఆర్ఎల్ఎం తదితర వాటికి సంబంధించిన పనులను పరిశీలించడమే కాకుండా పింఛన్లు, గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం సంతోష్ కుమార్ మాట్లాడుతూ చేసిన పనులకు సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ కింద చేసిన పనులకు సంబంధించి శిలాఫలకాలు భద్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ టీం సభ్యులు సూర్యకాంత, పంచాయతీరాజ్ డీఈ మోహన్‌రావు, ఎంపీడీఓ సుగుణశ్రీ, డిప్యూటీ ఎంపీడీఓ శివనాగాజ్యోతి, ఏపీడీ సాంబశివరావు, కోర్స్ డైరెక్టర్లు ఏసుదాసు, పరమేష్, ఏపీఓ గణేష్, ఈసీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వ విఫలం

నంద్యాల(అర్బన్): కుందూనది నూతన వంతెన పెండింగ్ పనులు పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎస్‌డీపీఐ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజాస్ హుసేన్ విమర్శించారు. విధిలేని పరిస్థితిలో వాహన దారులు శిథిలావస్థకు చేరిన వంతెనపైనే రాక పోకలు సాగిస్తున్నారన్నారు. పురాతన వంతెన కూలిపోతే అందుకు కూటమి ప్రభుత్వం, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నిర్మాణంలో జరుగుతున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఎస్‌డీపీఐ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం వంతెన వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజాస్ హుసేన్ మాట్లాడుతూ వర్షాకాలంలో వృద్ధులు, చిన్నారులు వంతెనపై ప్రయాణించాలంటే భయపడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు హనీఫ్, మాజీద్ ఖాన్, ఈశ్వర్‌రెడ్డి, హబీబుల్లా, సనావుల్లా, వాహిద్, అజారుద్దీన్, అత్తర్‌హుసేన్, అబ్దుల్ జలీల్, జమాల్ బాషా తదితరులు పాల్గొన్నారు.



వంతెన వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌డీపీఐ నాయకులు

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి



సదస్సును జయప్రదం చేయాలంటున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ప్రతి ఒక్కరు స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ పుల్లా నరసింహులు, క్రిష్టియన్ జేఏసీ నాయకులు మన్నెం జానయ్య, సమ్మద్, అబులైజ్, రిపబ్లిక్ ఆఫ్ ఇండియా పార్టీ అసెంబ్లీ కన్వీనర్ లింగస్వామి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ అంశంపై మంగళవారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలో సదస్సు నిర్వహిస్తున్నామని, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సోమవారం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అదానీతో కుమ్మక్కై స్మార్ట్ మీటర్లను బిగిస్తుందన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి మోసం చేసిందన్నారు. నాడు కూటమి నాయకులు స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి అని మాట్లాడి ఇప్పుడు వాటిని బిగించుకోవాలని చెప్పడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేయడానికే చంద్రబాబు అధికారంలోకి రావడం జరిగిందన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, మనోహర్‌బాబు, శివ, అన్సర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు సహకారం



కేఎంసీ పూర్వ విద్యార్థులతో చర్చిస్తున్న వీసీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటవుతున్న నాలెడ్జ్ సెంటర్‌కు తన వంతు సహకారం అందిస్తానని ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్ చెప్పారు. ఆయన సోమ వా రం ప్రిన్సిపాల్ చాంబర్‌లో కళాశాల పూర్వ విద్యార్థులతో సమావేశమయ్యారు. సెప్టెంబర్‌లో నాలెడ్జ్ సెంటర్ నిర్మాణానికి పునాది వేయనున్నట్లు తెలిపారు. నాలెడ్జ్ సెంటర్ వైద్యులకే గాక వైద్య విద్యార్థులకు సైతం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కళాశాలలోని వివిధ విభాగాలకు అవసరమైన వసతులు, సౌకర్యాలపై చర్చించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్ పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల అభివృద్ధికి సహకారం

ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని వీసీ డాక్టర్ చంద్రశేఖర్ చెప్పారు. ఆయన సోమవారం నర్సింగ్ కాలేజీని సందర్శించి ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ, విద్యార్థులతో మాట్లాడారు. బీఎస్సీ, నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్ విద్యార్థులు రీసెర్చ్ విభాగంలో ముందుకొస్తే నిధులు కేటాయిస్తామన్నారు. ప్రిన్సిపాల్ ఆర్.పద్మావతి, అధ్యాపకులు, ట్యూటర్లు పాల్గొన్నారు.

కుందూపరీవాహక ప్రాంతాల్లో వరదలను నివారించాలి



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల(అర్బన్): కుందూనది పరీవాహక ప్రాంతంలో వరదలను నివారించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జాదశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఉపాధ్యక్షుడు వైఎన్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని వినియోగించుకునే నిర్మాణాలు పూర్తిచేయకపోవడం, నిర్వహణ పట్ల పాలకుల నిర్లక్ష్యం సీమ పాలిట శాపంగా మారిందన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు 10వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం 22 రోజుల క్రితం మొదలు పెట్టి నేడు 31వేల క్యూసెక్కుల స్థాయికి పెంచారన్నారు. ఈ రోజు కూడా గండికోట, మైలవరం, బ్రహ్మసాగర్ రిజర్వాయర్లకు చుక్కనీరు అందడం లేదన్నారు. సీమ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి రిజర్వాయర్లకు 30 టీఎంసీల నీటిని కూడా తరలించలేక పోయారన్నారు. ఇప్పటికైనా రాయలసీమ అభివృద్ధి పట్ల పాలకులు నిజాయితీతో వ్యవహరించాలన్నారు.

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

- పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్ రాజకుమారి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపొద్దని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డీఆర్ఓ డి.రాము నాయక్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ వారికి అర్థమయ్యే విధంగా స్పష్టంగా ఇవ్వాలన్నారు. పీజీఆర్ఎస్‌లో 233 దరఖాస్తులు వచ్చాయి. ఈ సమస్యలన్నింటినీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

పేదల బతుకుల్లో వెలుగులు నింపేలా పీ4

పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా పీ-4 కార్యక్రమం ఉండాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో పలు అంశాలపై అధికారులతో ఆమె చర్చించారు. జిల్లాలో మొత్తం 42,937 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉండగా ఇప్పటికే 41,613 కుటుంబాలను దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో రైతులకు అవసరమైన మేర యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. అయితే, యూరియా పంటలకు ఎక్కువగా వాడరాదని సూచించారు. నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే వారు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సంక్షేమ వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాలని సంక్షేమాధికారులను ఆదేశించారు.

యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించండి

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పెంపుదలకు రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ (ర్యాంప్) కార్యక్రమాలు నిర్వహించి యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా, మండల స్థాయి అధికారులతో సమావేశమై ర్యాంప్ కార్యక్రమం నిర్వహణపై సలహాలు, సూచనలు ఇచ్చారు. పరిశ్రమల ఏర్పాటే లక్ష్యంగా ప్రతి మండలంలో జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ర్యాంప్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం ఎస్.మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యాలవాడ కుందూనది ఒడ్డున నాగుల పుట్ట కు పూజలు చేస్తున్న మహిళలు



శిరివెళ్లలో స్వామికి పూజలు చేస్తున్న మహిళలు



దొర్నిపాడులో నాగులకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

నాగమ్మా .. చల్లగా చూడమ్మా



నంద్యాల పట్టణ పరిధిలోని పార్కు రోడ్డులో జంట నాగులకు పాలు పోస్తున్న భక్తులు

సాక్షి నెట్ వర్క్: నాగుల చవితి వేడుకలు నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు ఆలయాల్లోని నాగమయ్య కట్టలకు, పుట్టలకు నువ్వుల పిండి, కొబ్బెర బెల్లం నైవేద్యంగా సమర్పించి పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. నూతన వధూవరులు నాగుల కట్టల చుట్టు ప్రదక్షణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణ మాసంలో మొదటి పర్వదినం కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. నంద్యాలలో పట్టణ శివారులోని చెరువు వద్ద వెలసిన బంగారు పుట్ట వద్ద భక్తులు ఉదయమే స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు, హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జంటనాగులకు విశేష పూజలు చేశారు. మహిళా భక్తులు ఒకరికొకరు పసుపు కుంకుమలు అందజేసుకున్నారు.

- పట్టణ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలలోని మైదానంలో ఉన్న పుట్టకు, పార్కురోడ్డులోని వాటర్ ట్యాంకు వద్ద ఉన్ననాగుల కట్ట విగ్రహాలకు, సంజీవనగర్ రామాలయంలో జంట నాగులకు భక్తులు క్షీరాభిషేకం నిర్వహించి మహామంగళ హారతులు నిర్వహించారు. నాగులకుంట రోడ్డులోని నాగలింగేశ్వరస్వామి దేవస్థానం, రోజాకుంటలోని నాగలింగేశ్వరస్వామి దేవాలయంలో జంట నాగులకు భక్తులు పూజలు చేశారు.
- ఆళ్లగడ్డ నియోజకవర్గంలో దొర్నిపాడు, ఉయ్యాలవాడ, చాగలమర్రి, రుద్రవరం, దొర్నిపాడు మండలాల్లో నాగుల చవితి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలంతా వేకువజామున్నే పుణ్య స్నానాలు ఆచరించి నాగదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గుగ్గిళ్లు, పానకం, పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. మరికొందరూ పొలాల్లో పుట్టలు చేసి మొక్కులు చెల్లించారు. ఉయ్యాలవాడలో కువజామున్నే భక్తులు స్థానిక కుందూనది ఒడ్డున వెలిసిన పుట్ట వద్దకు చేరుకొని ప్రత్యేకపూజలుచేశారు. మరి కొంత మంది మహిళలు శివాలయాల ఆవరణలో ఉన్న నాగ ప్రతిమలకు సంప్రదాయబద్ధంగా చీరె, సారె సమర్పించి మొక్కులు చెల్లించారు.



రుద్రవరంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు



చాగలమర్రిలోని చాగలమ్మతల్లి ఆలయం వద్ద పుట్టలో పాలు పోసి, సారె సమర్పిస్తున్న భక్తులు